క్లుప్తంగా

రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 16న బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో వామపక్ష రైతు, కార్మిక సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, వామపక్ష కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు జి చంద్రశేఖర్, మనోహర్, దస్తగిరి రెడ్డి, సుబ్బారెడ్డి, అన్వేష్, భాస్కర్ , శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

కడప సెవెన్‌రోడ్స్ : కరువు, తుపానుల కారణంగా జిల్లాలో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతూ సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్‌రెడ్డిలు ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం జేసీకి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కట్టా యానాదయ్య, నాయకులు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్ ఎదుట ధర్నా



విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు విద్యుత్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. విద్యుత్ సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులు కాంట్రాక్టు కార్మికులతోనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ పి. సుదర్శన్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి,వి సుబ్బి రెడ్డి, నాగ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మద్దిలేటి, ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కామాక్షమ్మ పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు డీఈఓ అనురాధకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేరీ, జిల్లా సహాయ కార్యదర్శి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా నగర శివార్లలోని ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తమ వాహనానికి అన్ని రకాల పత్రాలను తప్పక కలిగి ఉండాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ తప్పక రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు విజయ్ భాస్కర్, లక్ష్మీ ప్రసన్న, ట్రాఫిక్ ఎస్ఐ తాహిద్ తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ వ్యవస్థను ప్రోత్సహించవద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్: వెట్టిచాకిరీ వ్యవస్థను ప్రోత్సహించవద్దని ఉపకార్మిక కమిషనర్ బి.శ్రీకాంత్ నాయక్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈనెల 8, 9 తేదీలను వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన దినంగా ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా ఆయన తమ కార్యాలయంలో వెట్టి చాకిరీ వ్యవస్థను నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేయించామన్నారు. ప్రజలందరూ ఈ వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని ఆయన కోరారు.

నగరంలో సంబరాలు



యాత్ర-2 సినిమా విడుదల సందర్భంగా కేక్ కట్ చేస్తున్న అహమ్మద్‌బాషా

కడప కార్పొరేషన్: యాత్ర-2 సినిమా విడుదల సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక రవి గ్రూప్ థియేటర్స్ వద్ద ప్రీ షో సందర్భంగా హరూన్ గ్రూప్స్ ఎండీ అహ్మద్ బాషా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా తీసిన 'యాత్ర' సినిమా ప్రజాదరణ పొందినట్లే 'యాత్ర-2' కూడా ఆదరణ పొందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలంతా అవినీతి, అరాచక, తెలుగు దేశం పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజా యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎలాగైనా చంద్రబాబు అధికారంలోకి రావడానికి కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ అన్ని పార్టీలతో పొత్తులు కలుపు కుంటున్నారన్నారు. చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నినా ... సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ ఘన విజయం సాధించి మళ్లీ వైఎస్ జగన్ రెండోసారి సీఎం అవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షఫీ, అజ్మతుల్లా, శ్రీనివాసులరెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులు పరీక్ష భయాన్ని వీడాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి విద్యార్థులు పరీక్ష భయాన్ని వీడి పట్టుదలతో చదవాలని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గురువారం కడప జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పరీక్ష ఫోబియాను వదిలి పెట్టి మంచి మార్కుల కోసం ప్రయత్నం చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం పెట్టుకుని లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. కుటుంబాలలో పేదరికం పోవాలన్నా, సమాజం పురోగతి చెందాలన్నా, సమాజంలో గుర్తింపు రావాలన్నా చదువే ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి కష్టపడి చదివి ఉన్నత శిఖారాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భాగ్యవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కమలాపురం : కుల మతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదేనని జేసీఎస్ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, డీసీఎంఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని జంభాపురం సచివాలయం పరిధిలోని గొల్లపల్లె, నేలతిమ్మాయపల్లె, జంభాపురం గ్రామాలలో వారు ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి వారికి ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో మాత్రమే అమలు అవుతున్నాయన్నారు. ఈ పథకాలన్నీ తిరిగి రావాలంటే జగనన్నను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనువాసులరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఇతర నాయకులు రామకృష్ణారెడ్డి, గంగిరెడ్డి, సుబ్బారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్, విజయేంద్రా రెడ్డి, రమణారెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహారలోపం నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని సీడీపీఓ సునంద తెలిపారు. గురువారం అంగన్వాడీ కేంద్రాల్లో పోషక వేడుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటికే రేషన్ సరుకులు (టేక్ హోం రేషన్) కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్‌డ్రైవ్‌కు స్పందన



ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో గురువారం నిర్వహించిన మినీ జాబ్ డ్రైవ్‌కు చక్కటి స్పందన లభించింది. కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికల్లో ఫ్లిప్‌కార్ట్, ఆల్‌డిక్సన్, వైఎఫ్ఎంఎస్, క్వాస్‌కార్ప్ కంపెనీలు విచ్చేసి అభ్యర్థులను పలు ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నాయి. ఈ ఎంపికల్లో 131 మంది అభ్యర్థులు పాల్గొనగా 96 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ సి.హెచ్.రాము, మెంటార్లు సారధి, మంజుల, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందిస్తున్నామని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మధుసూదన్ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతనెల 22వ తేదీ ఓటర్ల తుది జాబితా విడుదల చేశారని, కడప నియోజకవర్గంలో మొత్తం 2,74,226 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో 1,33,890 మంది పురుషులు, 1,40,248 మంది మహిళలు కాగా, 88 మంది థర్డ్ జండర్స్ ఉన్నారని వివరించారు. ఇప్పటివరకు ఓటర్ల నమోదుకు సంబంధించి 2265 ఫారం-6, అభ్యంతరాలకు సంబంధించి 1864 ఫారం-7, 1305 ఫారం-8లు కలిపి మొత్తం 5434 క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అభ్యంతరాలపై పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన ముగ్గురు బీఎల్ఓలను ఇప్పటికే సస్పెండ్ చేశామని తెలిపారు. అలక్ష్యం వహించే వారికి షోకాజ్ నోటీసులు ఇస్తున్నామన్నారు. నగరంలో మరో 12 అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సిద్దల శివప్రసాద్, డీటీ రొనాల్డ్ పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో పల్లెకు పోదాం కార్యక్రమంలో కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి ప్రతి కార్యకర్త గ్రామంలోని ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి వివరించాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బాజి, బీజేపీ నాయకులు బత్తల పవన్ కుమార్, సతీష్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

కడప అర్బన్: నగరంలోని తారకరామానగర్‌కు చెందిన సంధ్యారాణి (17) అనే ఇంటర్ విద్యార్థిని ఈనెల 6వ తేదీ నుంచి కనిపించడం లేదనీ ఆమె తల్లి సుమలత గురువారం ఫిర్యాదు చేసింది. ఒన్‌టౌన్ సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని కళాశాలకు వచ్చి మధ్యలోనే వెళ్లిపోయినట్లు తెలియజేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

లింగ నిర్ధారణను నిషేధించాలి

జమ్మలమడుగు : ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం లింగ నిర్ధారణను నిషేధించాలని డిపూటీ డీఎంహెచ్ఓ శాంతికళ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆమె తనిఖీ చేసి ఆసుపత్రుల్లో జరిగిన ఆపరేషన్లు, ప్రసవాలను గురించి ఆరాతీశారు. ఆడపిల్లలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అబార్షన్ల కోసం వచ్చే వారికి భవిష్యత్తులో జరగబోయే నష్టాల గురించి వివరించాలన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి



ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ పోచంరెడ్డి నరేన్ రామాంజులురెడ్డి ప్రజలను కోరారు. గురువారం ఆయన స్థానిక పార్క్ వీధి, శివాలయం వీధి, బ్రాహ్మణ వీధుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండల ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జి.ఎన్.భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, సీనియర్ నాయకులు గణేష్ రెడ్డి, గుమ్మల్ల మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ టౌన్ కన్వీనర్ శ్రీనివాసరాజు, ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, సర్పంచ్ కళ్యాణ్, విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి సాయికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యరాజు, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నిత్య పూజయ్య, అన్వర్‌బాషా, అబ్దుల్‌రబ్, మునీర్ అహ్మద్, వారిస్, హస్రత్, సాదక్‌అలీ, జుమన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల పనితీరు ఆదర్శనీయం



ప్రతిభ కనబరిచిన ఉద్యోగులతో అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపోలో పనిచేస్తున్న ఆయా ఉద్యోగుల పనితీరు ఆదర్శనీయమని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆదర్శ ఉద్యోగులను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి డ్రైవరు, కండక్టర్ ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. కండక్టర్లు అంకయ్య, వీవీకే రెడ్డి, ప్రమీల, ఐవీవీ రెడ్డి, ఎస్ఆర్ కృష్ణ, డ్రైవర్ సి.నారాయణలు విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలువడాన్ని అభినందిస్తున్నామన్నారు. ఆర్టీసీని లాభాల బాటలో తీసుకు రావాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు సర్టిఫికెట్లను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సహాయం అందించాలి



పులివెందుల కోర్టులో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

కడప అర్బన్: బాల నేరస్తులకు న్యాయ సహాయం అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. పాన్ ఇండియా ప్రచారంలో భాగంగా ఆయన పులివెందుల సబ్‌జైలును సిబ్బందితో కలసి సందర్శించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ జైళ్లలో ఉన్న బాలనేరస్తులను గుర్తించి వారికి న్యాయ సహాయం అందించడం ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పులివెందుల కోర్టును సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఈనెల 9న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జైలు సూపరింటెండెంట్, పోలీసు అధికారులు, ప్యానల్ న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మెస్ ప్రారంభం



మెస్‌లో భోజనం వడ్డిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం బాలికల వసతిగృహంలో నూతన మెస్ డైనింగ్ హాల్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలసి గురువారం ప్రారంభించారు. వసతిగృహంలో 600 మంది విద్యార్థినులు ఉండగా వారి సౌకర్యార్థం మరొక నూతన మెస్‌ను 300 మంది విద్యార్థినులు కూర్చుని భోజనం చేసేలా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ చక్కగా చదువుకుని తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. అనంతరం వీసీ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి డా. పి. పార్వతి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, శివయాదవ్

కడప కార్పొరేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శాసన మండలి సభ్యులు రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పుల శివయాదవ్‌లు కలిశారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో కలిసి యాదవులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న మేలు గుర్తుచేసి అభినందించారు. వైఎస్ఆర్‌సీపీ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తామని సీఎంకు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యం



మాచునూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న మండల కన్వీనర్ చంద్రారెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మాచునూరు గ్రామ పంచాయతీలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వివరిచారు. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలన్ని కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే సీఎం చేసుకోవాల్సి అవసరం ఎంతైన ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను గెలిపించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ లావణ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, పుల్లారెడ్డి, కృష్ణారెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు మళ్లీ అందాలంటే జగనన్నే మన రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బోడోద్దులపల్లి గ్రామంలో వారు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలంటే మనం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ హిదాయతుల్లా, సర్పంచ్ కొత్తపల్లి రాజశేఖర్ రెడ్డి, వద్దిరెడ్డి సురేంద్రరెడ్డి, ఎంపీటీసీ నారీ నాగరాజు వైఎస్ఆర్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మహిళ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకుని వెళ్తున్న ప్రతినిధులు

కడప అర్బన్: శ్రీ కాశీ విశ్వనాథసేవాసమితి ఆధ్వర్యంలో కడప రిమ్స్ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించిన గుర్తు తెలియని మహిళ మృతదేహానికి ఖాజీపేట పోలీసుల సిఫారసు మేరకు గురువారం అంత్యక్రియలను నిర్వహించారు. ఖాజీపేట సమీపంలో రెండు రోజుల క్రితం బైపాస్‌రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో 48 సంవత్సరాల మహిళ మృతి చెందింది. పోలీసులు చుట్టుపక్కల వారిని విచారించగా ఆమెకు సంబంధించిన బంధువులు లేకపోవడంతో కడప నగరంలోని శ్రీ కాశీ విశ్వనాథసేవాసమితి వారికి అంత్యక్రియల కోసం విన్నవించగా హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, పుట్టా పురుషోత్తం, సివిల్ సప్లై సురేష్, రాఘవేంద్ర, టైలర్ రవి పాల్గొన్నారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

- మాదిగల సమ న్యాయ సభలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు



మాదిగల సమ న్యాయ సభలో మాట్లాడుతున్న దాసరి సువర్ణరాజు తదితరులు

కడప రూరల్: వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు అన్నారు. గురువారం సాయంత్రం కడపలోని స్కౌట్ ప్రాంగణంలో మాదిగల సమ న్యాయ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు.

రాష్ట్రంలో ఎస్సీ అసెంబ్లీ స్థానాలు 29, పార్లమెంట్ స్థానాలు నాలుగు ఉన్నాయని తెలిపారు. అందులో మాదిగలకు 11 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలను కేటాయించి సమ న్యాయం చేయాలని కోరారు. కాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే పలు ఎమ్మెల్యే స్థానాలతో పాటు మాదిగలకు ఒక ఎంపీ స్థానంలో అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. అలాగే మాదిగ ఉద్యమ కారులపై బనాయించిన కేసులను ఎత్తివేయడం అభినందనీయమన్నారు. వచ్చే ఎన్నికల్లో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, పూతలపట్టు వెంకటేష్, ఆర్ఎస్ రాజ, శేఖర్, ఎదురూరు బాబు తదితరులు పాల్గొన్నారు.

సగం సీట్లు మాదిగల కేటాయించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రానున్న ఎన్నికల్లో ఎస్సీ రిజర్వుడు నియోజక వర్గాల్లో 29 అసెంబ్లీ, నాలుగు పార్లమెంటు స్థానాల్లో సగం సీట్లు మాదిగలకే కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.కృష్ణయ్య తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని తెలిపారు. రాజకీయాలలో మాలలకి ఇచ్చిన ప్రాధాన్యత మాదిగలకు ఇవ్వటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యువసేన అధ్యక్షులు నరేంద్ర మాదిగ, పి నారాయణ స్వామి కంబగిరి రాయుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మహబూబ్ ఆలీ

కడప ఎడ్యుకేషన్: కడప మెడికేర్ హాస్పిటల్‌లో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం అయ్యింది. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ మహబూబ్ ఆలీ పాల్గొని పలువురికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఏడు వేల రూపాయల విలువ గల ఫైబ్రోస్కాన్ పరీక్షను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సయిద్‌నూర్, సాహిద్‌పఠాన్, గౌతమి, భార్గవి, శిరీషరెడ్డి, వైష్ణవి, మౌలానీ, సువర్ణ పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవు

- కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ హెచ్చరిక



మాట్లాడుతున్న డీఎస్పీ షరీఫ్

కడప అర్బన్: కడప నగరంతో పాటు, సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా సరే సోషల్ మీడియాను వేదికగా చేసుకుని అసత్య ప్రచారాలను చేస్తే వారిపై చర్యలు తప్పవని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ హెచ్చరించారు. గురువారం కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీడియా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తాము చేసే ప్రచార సంఘటనల ద్వారా ప్రజలు భయాందోళనకు గురికాకుండా చూడాలని ఆయన సూచించారు.